క్లుప్తంగా

మెప్మా కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా కార్యక్రమాల్లో భాగంగా మెప్మా పథక సంచాలకులు టి.రవికుమార్ ఆదేశాల మేరకు స్థానిక గిద్దలూరు మెప్మా కార్యాలయంలో గిద్దలూరు పట్టణ సమాఖ్య సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సిటీ మిషన్ మేనేజర్ అందుగుల ప్రసాద్.. పట్టణ సమాఖ్య బోలోపేతం గురించి వివరించారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మెప్మా ఎస్వీ కమిటీ చైర్మన్ పగడాల వెంకటేశ్వర్లు, నిర్మలాదేవి, దొంత లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య సొంత నిధులు 10 వేల రూపాయలు ఖర్చు చేసి 180 మందికి పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు, అధ్యాపకులు అల్లూరయ్య, శంకర్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు దంత వైద్యశిబిరం

దర్శి: భార్గవి దంత వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం పీజీఎస్ కాంప్లెక్స్ హాలులో దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు పేర్నిక షారీన్‌బాబు, శ్రుతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో దంత సమస్యలు ఉన్న వారికి ఉచితంగా వైద్యం, మందులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ నిలిపివేత

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల, దద్దవాడ పంచాయతీలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. తాటిచెర్ల, దద్దవాడ పంచాయతీల్లోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రాయవరం పరిధిలో..

మార్కాపురం టౌన్: రాయవరం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్ ఇంజినీర్ సుబ్బరాయుడు తెలిపారు. రాయవరం, ఎస్టేట్, ఏకలవ్య కాలనీ, గోగులదిన్నె, నాయుడుపల్లి, మన్నెంవారిపల్లి, యాచవరం, బోడపాడులో సరఫరా ఉండదన్నారు.

విద్యార్థుల మార్గదర్శకాలపై అవగాహన

కంభం: మండలంలోని తురిమెళ్ళ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులు అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలను తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులు పాటించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. వీరనారాయణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తహసీల్దార్ సేవలు మరవలేనివి

గిద్దలూరు రూరల్: గిద్దలూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాజరమేష్ ప్రేమ్‌కుమార్ పదోన్నతిపై నెల్లూరు జిల్లా తెలుగు గంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. సీసీఎల్‌ఏ అమరావతి నుంచి ఆదేశాలు వచ్చిన సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.పి రంగయ్య, గిద్దలూరు మండల అధ్యక్షుడు వెంకట్రామయ్య, ఈశ్వర్‌రెడ్డి, అచయ్య, రమణ, జాషువ, హనుమంతరావు శాలువకప్పి పూలమాలతో ఘన సన్మానం చేశారు.

తహసీల్దార్‌ను సన్మానించిన ఎంపీడీఓ

మార్కాపురం టౌన్: తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన నేపథ్యంలో శుక్రవారం ఎంపీడీఓ తోట చందన తన సిబ్బందితో వెళ్లి బొకే అందించి సన్మానించారు. ఎన్జీవో సంఘం కార్యదర్శి వి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటన..

శుక్రవారం డ్రై డేలో భాగంగా ఎంపీడీవో రాయవరం, గోగులదిన్నెలో పర్యటించి చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. తడి పొడి చెత్తను వేరు వేరుగా వేయాలన్నారు.

నేడు పెద్దదోర్నాలకు మంత్రి సురేష్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాలలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మండల కేంద్రంలోని 2 వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గీతకార్మికులకు పరిహారం పెంపుపై హర్షం

యర్రగొండపాలెం: కల్లు గీత కార్మికుల సంక్షేమం కోసం కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గౌడ సంఘం నాయకులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. గీత కార్మికులు శాశ్వత వైకల్యం బారిన పడితే రూ.10 లక్షలు పరిహారం చెల్లించడం మంచి పరిణామమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.2 లక్షలే అందజేశారని చెప్పారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు కంచర్ల వెంకటయ్య గౌడ్, కొమరం కోటేశ్వరరావు గౌడ్, కె.రవిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

హౌసింగ్ లబ్ధిదారులతో ముఖాముఖి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నకేశవ రెడ్డి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ


రాచర్ల: గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కవితా చౌదరి

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో ఏర్పాటు చేసిన జగనన్న లేఔట్లను ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్ శుక్రవారం సందర్శించి లబ్ధిదారులతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం గ్రామాల్లోని లబ్ధిదారులతో మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు వీలైనంత త్వరలో గృహాలు నిర్మించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. బిల్లులు వెంటనే చెల్లించాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. గృహాలు నిర్మించుకోలేని వారికి బ్యాంకులో రూ.30 వేల రుణ సౌకర్యం కల్పిస్తామని వైకేపీ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈఓఆర్డీ ఎస్.డేవిడ్, పంచాయతీ కార్యదర్శి యల్లాబాబు, వీఆర్‌ఓ మాచర్ల పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

బేస్తవారిపేట: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్. చెన్నకేశవరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జేబీకే పురంలో జగనన్న హౌసింగ్ కాలనీ తనిఖీ చేశారు. గృహ నిర్మాణ పనులు చేపట్టినవారికి వెలుగు నుంచి అదనంగా లోన్ మంజూరు చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది సకాలంలో కార్యాలయానికి హాజరు కావాలని, వలంటీర్లు ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ వేగవంతం చేయాలని సూచించారు. పందిళ్లపల్లిలో జరుగుతున్న మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఏఈలు శ్రీనివాస నాయక్, పోలయ్య, ఏపీఎం రఘునాథ్ బాబు పాల్గొన్నారు.

దర్శి: నిర్మాణాలు వేగవంతంగా జరిపేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా హౌసింగ్ ప్రత్యేకాధికారి రఘురామిరెడ్డి ఆదేశించారు. మండలంలోని పోతవరం, తానంచింతల, తిమ్మాయిపాలెం గ్రామాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న నివాసాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ ఉగాది నాటికి నివాసాలన్నీ పూర్తవ్వాలని చెప్పారు. వారం వారం బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బిల్లు మంజూరు చేయడంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఎంత వేగంగా నిర్మాణాలు పూర్తి చేసుకుంటే అంత త్వరగా బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. మొత్తం 60పైగా నివాసాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. నియోజకవర్గ హౌసింగ్ ప్రత్యేకాధికారి తేళ్ల రవికుమార్, డీఈ నిరీక్షణరావు, ఏఈ షకీర్, ఏపీఎం విజయకుమారి, ఏపీఓ కళ్యాణి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని

రాచర్ల: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.కవితా చౌదరి అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా మండల కేంద్రం రాచర్లలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న గృహ నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లోని గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, గృహ నిర్మాణశాఖ ఏఈ విజయలక్ష్మి, గృహనిర్మాణశాఖ సహాయకుడు రామ్మోహన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి సురేష్‌కు రథసప్తమి వేడుకల ఆహ్వానం


మంత్రి సురేష్‌కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న కేశవరావు, కాశీవిశ్వనాథం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన చైర్మన్

మార్కాపురం: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివారి దేవస్థానంలో ఈనెల 28న జరిగే రథసప్తమి వేడుకలకు హాజరు కావాలని కమిటీ నిర్వాహకులు పురపాలకశాఖ మంత్రి సురేష్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనంతో ఉత్సవాలు జరుగుతాయని చైర్మన్ పెనుగొండ కేశవరావు తెలిపారు. స్వామివారు శేష, గరుడ, హనుమంత వాహనాలపై దర్శనమిస్తారని, చక్రస్నానం అనంతరం కల్పవృక్ష వాహనం తరువాత వెండి రథంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. చివరిగా చంద్రప్రభ వాహనం ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రథసప్తమి కమిటీ కన్వీనర్ యక్కలి కాశీవిశ్వనాథం, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, ఉటుకూరి రామకృష్ణా, జనార్దన్, రామడుగు రమేష్, అప్పనాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు


ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న కేపీ నాగార్జున రెడ్డి

పొదిలి రూరల్: పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం పొదిలి నగర పంచాయతీ సచివాలయం -1 పరిధిలోని 20వ వార్డులో అమ్మవారిశాల, గుద్దేటివారి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 95 శాతం వరకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. స్థానికులు పింఛన్లు, కాలువల మరమ్మతులు, నీటి సమస్యలపై ఎమ్మెల్యేకి విన్నవించారు. నగర పంచాయతీ కమిషనర్ డానియల్ జోసఫ్, ఎంపీడీఓ పి. శ్రీకృష్ణ, ఈఓఆర్డీ రాజశేఖర్, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జమాన్ బేగం, గౌసియా బేగం, ముల్లా యాసిన్, పొదిలి రాంబాబు, రవికిశోర్, నాయబ్ రసూల్, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జి. శ్రీనివాసులు, యక్కలి శేషగిరిరావు, కల్లం సుబ్బారెడ్డి, ఫిరోజ్, గూడూరి వినోద్, కొత్తూరి శ్రీనివాసులు రాంబాబు, ముల్లా జాకీర్ పులిగొర్ల శ్రీనివాసులు, మల్లాపురం నరసింహులు, పేరం కోదండ రామిరెడ్డి పాల్గొన్నారు.

భూముల కొనుగోలులో పార్టీకి సంబంధం లేదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాములు

తర్లుపాడు: చట్టపరంగా భూమిని కొనుగోలు చేస్తే పార్టీలకు సంబంధమేమిటని కలుజువ్వలపాడు వైఎస్సార్ సీపీ నాయకులు మందా కొండారెడ్డి ప్రశ్నించారు. గత రెండు రోజులుగా ఓ మీడియాలో వచ్చిన కథనాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కలుజువ్వలపాడుకు చెందిన పెద్ద మల్లయ్యకు ఇద్దరు కుమారులు కాగా సోదరుల్లో ఒకరైన పత్తిపాటి రాములుకు చెందిన వ్యవసాయ భూమిని అతని వ్యక్తిగత అవసరాల కోసం అమ్ముకుంటే వైఎస్సార్ సీపీకి ఏమి సంబంధమని నిలదీశారు. గత ప్రభుత్వంలో ఎకరాలకు ఎకరాలు పేదల భూములు అన్యాక్రాంతం చేసిన నేతలే వెనకుండి అసత్య ఆరోపణలు చేయిస్తున్నారంటూ ఆరోపించారు.

అవసరాల నిమిత్తం అమ్ముకున్నాం:

తమ కుటుంబ అవసరాల నిమిత్తం తన తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని అమ్ముకున్నట్లు పత్తిపాటి రాములు వివరించారు. తమది మండలంలోని కలుజువ్వలపాడు గ్రామమని, తమ తండ్రికి ఇద్దరు కుమారులమని, తన వాటాగా 152/2బి, 153/2బిలో వచ్చిన 5.18 ఎకరాల భూమిని మేకలవారిపల్లి గ్రామానికి చెందిన దారెడ్డి శివకేశవరెడ్డికి అమ్మినట్లు ఆయన తెలిపారు. అయితే సదరు ఆస్తి గతంలోనే అమ్మినట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అసత్య ప్రచారం చేస్తున్న తన సోదరి భార్య భ్రమరాంబపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు పత్తిపాటి రాములు వివరించారు.

ఈద్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి


ఎమ్మెల్యే కేపీకి వినతిపత్రం ఇస్తున్న షంషీర్ అలీబేగ్ తదితరులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని 10వ వార్డు ఈద్గా, శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషీర్ అలీబేగ్, డాక్టర్ మగ్బుల్‌బాషా, కమిటీ అధ్యక్షులు హబీబుల్లా.. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. మౌలాలి, చిన్న షెక్షావలి, రహంతుల్లా, తదితరులున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు

మార్కాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌లు, హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. మార్కాపురం పట్టణ, రూరల్, తర్లుపాడు, బేస్తవారిపేట, గిద్దలూరు, యర్రగొండపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు 8 ఉండగా 28 మంది, హెల్పర్‌లు 15 పోస్టులకు గాను 32 మంది, ఒక మినీ పోస్టుకు ఒకరు హాజరైనట్లు పీడీ ధనలక్ష్మి తెలిపారు. సబ్ కలెక్టర్ సేదు మాధవన్, పీడీ ధనలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాహుల్, సీడీపీవో నాగమణి నిర్వహించారు.

ఎన్‌సీసీ పరీక్షకు 168 మంది హాజరు

మార్కాపురం టౌన్: పట్టణంలోని కమలా హైస్కూల్‌లో శుక్రవారం 34ఏ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు విద్యార్థులకు ఎన్‌సీసీ ఏ- సర్టిఫికెట్ కోసం పరీక్ష నిర్వహించారు. కమల, మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత, రాయవరం, యర్రగొండపాలెం పాఠశాలలకు చెందిన 168 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపల్ షరీఫ్ తెలిపారు. ఎన్‌సీసీ సుబేదార్ నిర్భయ్‌సింగ్, హవాల్దార్ సురేష్ పరీక్షను నిర్వహించారు.

బసవయ్య సేవలు అభినందనీయం

దర్శి: నేషనల్ అవార్డు గ్రహీత, బొట్లపాలెం పశువైద్యాధికారి బసవయ్య సేవలు అభినందనీయమని ఎంపీడీఓ కుసుమకుమారి అన్నారు. పశువైద్యునిగా సేవలందించినందుకు ఇటీవల నేషనల్ అవార్డును బసవయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయసిబ్బంది సత్కరించారు. ఎంఈఓ రఘురామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించండి

యర్రగొండపాలెం: సమ్మెటివ్-1 పరీక్షల్లో టాపర్స్‌ను హెడ్మాష్టర్లు అభినందించాలని ఎంఈవో పి.ఆంజనేయులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీఎస్(బీసీ)లో మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రోత్సాహించాలన్నారు.

ఆలయ ముఖ ద్వారం పరిశీలన


ముఖ ద్వార పనులను పరిశీలిస్తున్న మంత్రి సురేష్

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం కుమారగిరి ఘాట్ రోడ్డు వద్ద తన సొంత నిధులు రూ.31 లక్షలతో చేపట్టిన ముఖ ద్వార నిర్మాణాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం పరిశీలించారు. మహాశివరాత్రిలోగా ముఖద్వార పనులు పూర్తి చేయాలని ఇంజినీర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, ఆర్‌వీ పిచ్చయ్య, ఎస్.పోలిరెడ్డి తదితరులు ఉన్నారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు

కురిచేడు: రోడ్డుపై వెళ్తున్న మహిళను వెనుక వైపు నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. మండలంలోని బోధనంపాడుకు చెందిన గుర్రపుశాల రమణమ్మ పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తోంది. దర్శిలో పనులు ముగించుకుని తిరిగి కురిచేడుకు తన ద్విచక్ర వాహనంపై వస్తున్న దేవతి సుబ్రహ్మణ్యం.. రమణమ్మను వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. రమణమ్మ తలకు బలమైన గాయమైంది. క్షతగాత్రురాలిని ఆటోలో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఒంగోలు తీసుకెళ్లాలని సూచించారు.

పోలవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

ముండ్లమూరు: మండలంలోని పోలవరంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇటీవల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా గ్రామస్తులు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. అందులో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రూ.20 లక్షలు కేటాయిస్తానని మాట ఇచ్చారు. వెంటనే నిధులు మంజూరు కావడంతో గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నెమలిదిన్నె సుబ్బారెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మూడు రోజుల్లో పూర్తి చేశారు. గ్రామంలో సమస్యలు వెంటనే పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణ పనులను సర్పంచ్‌తో కలిసి నాయకులు పరిశీలించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నెమలిదిన్నె సుబ్బారెడ్డి, ముతికేపల్లి కృష్ణారెడ్డి, మిట్టా సుబ్బారెడ్డి, సన్నపురెడ్డి వెంగళరెడ్డి, కొణతం అంజిరెడ్డి, చల్లా అంజయ్య ఉన్నారు.

బసవయ్య సేవలు అభినందనీయం

దర్శి: నేషనల్ అవార్డు గ్రహీత, బొట్లపాలెం పశువైద్యాధికారి బసవయ్య సేవలు అభినందనీయమని ఎంపీడీఓ కుసుమకుమారి అన్నారు. పశువైద్యునిగా సేవలందించినందుకు ఇటీవల నేషనల్ అవార్డును బసవయ్య అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ కాకర్ల రఘురామయ్య పాల్గొన్నారు.

గ్రామీణుల చెంతకే వైద్యం

తాళ్లూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంతో గ్రామీణుల చెంతకే వైద్యం అందుతున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. తాళ్లూరు మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, మాధవరం సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూర్పుగంగవరంలో వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలు, ఇతర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మాధవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌లో అందుతున్న సేవలను, రోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యుడు బి.రత్నం, వైద్యుడు హనుమానాయక్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పాఠశాలలో 25 కుళాయిలు చోరీ

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన కుళాయిలు చోరీకి గురైనట్లు హెచ్‌ఎం విశ్వనాథ్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో నాడు నేడు పథకం ద్వారా మరుగుదొడ్లకు 15, ట్యాంక్‌కు 10 కుళాయిలను ఏర్పాటు చేశారని, వాటి విలువ దాదాపు రూ.20 వేలు ఉంటుందని పేర్కొన్నారు. కుళాయిల చోరీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఏడు వాటర్ ప్లాంట్లు సీజ్

మార్కాపురం: విజిలెన్స్ ఎస్పీ భవాని హర్ష ఆదేశాల మేరకు మార్కాపురం పట్టణ, మండల పరిధిలో శుక్రవారం సరైన ధ్రువపత్రాలు లేకుండా.. అనధికారికంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లపై దాడులు నిర్వహించినట్లు విజిలెన్స్ డీఎస్పీ అశోక్ వర్ధన్ తెలిపారు. రాయవరంలో నవ్యభారతి చారిటబుల్ ట్రస్టు, జగన్నాథస్వామి వాటర్ ప్లాంట్, తౌఫిక్ వాటర్ ప్లాంట్, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర మినరల్ వాటర్ ప్లాంట్, బండారు సుబ్బారావు వాటర్ ప్లాంట్, ఏకలవ్య నగర్‌లోని జగదీశ్వరి వాటర్ ప్లాంట్, అమ్మవారిపల్లిలోని తన్మయ్ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వెంగళ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ


మద్దిశెట్టి రవీంద్రను కలసిన ఎస్సై ప్రేమ్ కుమార్


ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్

తాళ్లూరు: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా బి.ప్రేమ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఒంగోలు డీసీఆర్‌బీలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తానని, తాళ్లూరు, తూర్పుగంగవరాల్లో ట్రాఫిక్ నియంత్రణ, చోరీల నియంత్రణ, ఇతర అసాంఘిక చర్యల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలు నేరుగా తనను కలిసి సమస్యను విన్నవించుకోవచ్చని చెప్పారు. ముందుగా జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని ఆలయంలో ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఏఎస్‌ఐ మోహాన్‌రావు, సిబ్బంది నూతన ఎస్‌ఐను మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాళ్లూరు మండల ఇన్‌చార్జి మద్దిశెట్టి రవీంద్రను ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్ దర్శిలో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పరిస్థితులపై వారు చర్చించుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజలు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ కోరారు. మండలంలోని మారెళ్ల, మక్కెనవారిపాలెం, ఈదర, ఉమామహేశ్వరపురం, పూరిమెట్ల, జమ్మలమడక గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పలు సలహాలు, సూచనలు చేశారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా వెంటనే తెలియజేయాలన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. దాడికి ప్రతి దాడి సరైంది కాదన్నారు. పంతాలకు పోకుండా సంయమనం పాటిస్తే సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవచ్చన్నారు. నూతన వ్యక్తులు తారసపడితే వెంటనే తెలియజేయాలన్నారు.

ఆరోగ్యంపై లాయర్లు శ్రద్ధ తీసుకోవాలి


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న న్యాయమూర్తి రాజా వెంకటాద్రి

మార్కాపురం టౌన్: నిత్యం ఒత్తిడితో ఉండే లాయర్లు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని మార్కాపురంలోని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సూచించారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన కిమ్స్ వైద్యశాల బృందం లాయర్లకు పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. సీనియర్ సివిల్ జడ్జి రమేష్‌నాయుడు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, వైద్యులు రామాంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ నారాయణరెడ్డి, భూపని కాశయ్య పాల్గొన్నారు. 200 మందికి మందులు అందించినట్లు పీఆర్‌ఓ ప్రభాకర్ తెలిపారు.

ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా శ్రీనివాసులు


శ్రీనివాసులు

మార్కాపురం: సీనియర్ న్యాయవాది తోట శ్రీనివాసులను గిద్దలూరు కోర్టు ద్వితీయ శ్రేణి న్యాయమూర్తిగా నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. తాను ఇప్పటి వరకు దర్శి కోర్టులో స్పెషల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేసినట్లు చెప్పారు.

యాదవ సంఘ మండల అధ్యక్షునిగా అల్లూరయ్య

బేస్తవారిపేట: స్థానిక యాదవ భవన్‌లో మాజీ ఎంపీపీ పి. వెంకటరాజు, డాక్టర్ మొర్రి పిచ్చయ్య ఆధ్వర్యంలో బేస్తవారిపేట మండల అఖిలభారత యాదవ మహా సంఘం నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. సమావేశానికి అఖిలభారత యాదవ మహా సంఘం జిల్లా అధ్యక్షుడు మేకబోయిన గురుప్రసాద్ హాజరయ్యారు. మండల యాదవ సంఘం అధ్యక్షునిగా పాశం అల్లూరయ్య, ప్రధాన కార్యదర్శిగా బత్తుల క్రిష్ణమూర్తి, గౌరవ అధ్యక్షునిగా మేకల ఆవులయ్య, గౌరవ సలహాదారునిగా బత్తుల వెంకట రామసుబ్బయ్య, సత్యేలి కృష్ణ, ఉపాధ్యక్షునిగా పల్లెబోయిన గోపాల్, ట్రెజరర్‌గా వందనబోయిన రంగనాయకులు, జాయింట్ సెక్రటరీగా నన్నేబోయిన శ్రీనివాసులు, యూత్ కమిటీ అధ్యక్షునిగా బండ్లమూడి రంగసాయి, ప్రధాన కార్యదర్శిగా చింతం చిన్న కొండయ్య, ఉపాధ్యక్షుడుగా రేగులగడ్డ మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

దర్శి: నాటుసారా, గంజాయి, డ్రగ్స్ వంటి హానికర మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఒంగోలు ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ ఆవులయ్య హెచ్చరించారు. శుక్రవారం దర్శి ఎస్‌ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు సమీక్షించి వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ పరివర్తన-1, పరివర్తన-2 కార్యక్రమాల ద్వారా జిల్లా నుంచి సారాను పూర్తిగా తరిమికొట్టాలన్నారు. ఒక్క దర్శి ఎస్‌ఈబీ స్టేషన్‌లోనే గడిచిన ఏడాదిలో 17 సారా కేసులు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుతం గంజాయిపై పూర్తి స్థాయి దృష్టి సారించినట్లు తెలిపారు. గంజాయి మూలాలు కనుగొని ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా అవుతున్న రవాణాను నివారిస్తున్నామన్నారు. అక్రమంగా రవాణా అవుతున్న మద్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎస్పీ, అడిషనల్ ఎస్పీల ఆధ్వర్యంలో ఎస్‌ఈబీ, పోలీస్ శాఖలు ఒకటిగా కలిసిపోయి పని చేయడంతోనే సత్ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఎస్‌ఈబీ సీఐ బి.సుందర రామయ్య, ఎస్‌ఐ ఎం.శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేను ఎవరినీ మోసం చేయలేదు

మార్కాపురం: పట్టణానికి చెందిన వేమా రాజాను తాను మోసం చేసినట్లుగా వివిధ దినపత్రికల్లో, సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయని, అవి నిజం కావని టీడీపీ మాజీ కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజా అప్పట్లో తన దగ్గరకు వచ్చి సాయం చేయమని కోరగా చేశానని చెప్పారు. అతనే వచ్చి పంచాయితీ చేయమని కోరగా సాయం చేసినట్లు తెలిపారు.